క్లుప్తంగా

ఎడతెరిపిలేని వర్షం



తెనాలిఅర్బన్: తెనాలి పట్టణంలో ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు చిరుజల్లులతో కూడిన వర్షం కురిసింది. మధ్యాహ్నం నుంచి వర్షం తగ్గడంతో ప్రజలు ఉపశమనం పొందారు. ఉదయం విద్యార్థులు, ఉద్యోగులు వివిధ పనులు చేసుకునే వారు కొంత ఇబ్బంది పడ్డారు. వర్షం కారణంగా పట్టణంలోని కొన్ని రోడ్లు కొంతమేర నీటితో నిండాయి.

ప్రమాదాల నివారణకు చర్యలు

ప్రత్తిపాడు: ప్రమాదాల నివారణకు పోలీసులు ఆర్ అండ్ బీ అధికారులతో కలిసి నివారణ చర్యలు చేపట్టారు. ఇటీవల వరుసగా కురుస్తున్న వర్షాలకు ప్రత్తిపాడులోని గుంటూరు పర్చూరు పాత మద్రాసు రోడ్డుపై, పంచాయతీ కార్యాలయం ఎదురు ఆర్ అండ్ బీ రోడ్డుపై గుంతలు పడ్డాయి. దానికి తోడు టిప్పర్లు, భారీ వాహనాలు ఈ మార్గంలో అధికంగా తిరుగుతుండటంతో గుంతలు పెద్దవయ్యాయి. ఈ నేపథ్యంలో వాహనదారులు రాత్రి సమయాల్లో గుంతల వల్ల ప్రమాదాల బారిన పడుతున్నారు. దీంతో ప్రత్తిపాడు ఎస్‌ఐ డి. రవీంద్రబాబు గుంతలు పూడ్పించే సామాజిక బాధ్యత తను తీసుకున్నారు. ఆర్ అండ్ బీ ఏఈతో మాట్లాడి సోమవారం రాత్రి మెయిన్ రోడ్డుపై పడిన గుంతలను దగ్గరుండి పూడ్పించారు. ప్రమాదాల నివారణకు తన వంతుగా చర్యలు తీసుకున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.

రైతుల అభివృద్ధి దిశగా పరిశోధనలు చేపట్టాలి

గుంటూరు రూరల్: రైతుల అభివృద్ధికి నూతన పరిశోధనలు చేపట్టాలని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ ఆర్ శారద జయలక్ష్మి తెలిపారు. సోమవారం నగర శివారులోని లాంఫాం వ్యవసాయ పరిశోధన కేంద్రాన్ని ఆమె సందర్శించారు. శాస్త్రవేత్తలు, బోధన, బోధనేతర సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ సమన్వయంతో కృషి చేసి, విశ్వవిద్యాలయాన్ని ముందుకు తీసుకెళ్లే దిశగా పరిశోధనలు జరపాలని సూచించారు. తనపై నమ్మకంతో వీసీగా నియమించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం బయో టెక్నాలజీ ల్యాబ్‌ను సందర్శించి, అక్కడ జరుగుతున్న పరిశోధనలను శాస్త్రవేత్తలను అడిగి తెలుసుకున్నారు.

రూ.1.44లక్షల అక్రమ మద్యం సీజ్

బాపట్లటౌన్: ఇతర రాష్ట్రాల మద్యాన్ని గుట్టు చప్పుడు కాకుండా తీసుకొచ్చి, సొమ్ము చేసుకుంటున్న ముఠా గుట్టును పోలీసులు రట్టు చేశారు. రూ. 1.44 లక్షల విలువ కలిగిన కర్నాటక మద్యాన్ని తరలిస్తుండగా పట్టణ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలను పట్టణ పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ వెంకటేశులు సోమవారం వెల్లడించారు. చీరాల మండలం ఓడరేవుకు చెందిన కట్టా కోకిల, చిన్నపోతుల సాయి, చిన్నపోతుల మణికంఠ, స్టువర్టుపురం, 3వ గ్యాంగ్‌కు చెందిన వల్లభ రూఫస్, ఒంగోలు టౌన్ 1వ వీధి మహేంద్ర నగర్‌కు చెందిన షేక్ బాషా, వేటపాలెం మండలం, దేశాయిపేటకు చెందిన నరస సందీప్ ఒక ముఠాగా ఏర్పడి కర్నాటక, గోవా రాష్ట్రాలకు చెందిన మద్యాన్ని బాపట్ల జిల్లాలోని పలు ప్రాంతాలకు తరలించి, విక్రయిస్తున్నారు. ఆదివారం సాయంత్రం బాపట్ల పట్టణంలోని రాజీవ్‌గాంధీ కాలనీ, పాత కబేళ సమీపంలో నుంచి ఏపీ31ఏడీ 3799, ఏపీ 27టీవై 4856 నంబర్లు గల కార్లలో 11 బ్యాగుల్లో 180 మి.లీ బాటిళ్లు 907, 60 ఫుల్ బాటిల్స్ చొప్పున మొత్తం రూ. 1,44,400 విలువ కలిగిన 1,023 బాటిళ్లను తరలిస్తున్నట్లు పక్కా సమాచారం రావడంతో పట్టణ సీఐ యు. శ్రీనివాసులు తన సిబ్బందితో దాడిచేసి స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా మద్యం తరలించినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. విలేకరుల సమావేశంలో పట్టణ సీఐ యు. శ్రీనివాసులు, ఎస్‌ఐ షేక్ రఫీ పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

కొల్లూరు : పౌష్టికాహారంతో ఆరోగ్యంగా ఉండొచ్చని ఐసీడీఎస్ కొల్లూరు సెక్టార్ సూపర్‌వైజర్ టి.విజయలక్ష్మి అన్నారు. సోమవారం రావికంపాడు అంగన్‌వాడీ–2 కేంద్రంలో నిర్వహించిన పౌష్టికాహార మాసోత్సవాల్లో గర్భిణులకు, బాలింతలకు ఆమె పలు సూచనలు చేశారు. ప్రభుత్వం అందజేస్తున్న పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా తీసుకోవాలని సూచించారు. ఎంఎల్‌హెచ్‌పీ అఖిల, ఏఎన్‌ఎం నాగలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు కె.శ్రీలత, టి.శ్రీదేవి, ఆశ కార్యకర్తలు కె.మరియమ్మ, స్వప్న, సుబ్బమ్మ పాల్గొన్నారు

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ

నిజాంపట్నం: మొక్కలతోనే పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని ప్రిన్సిపల్ కోటేశ్వరరావు తెలిపారు. నిజాంపట్నంలోని ఎస్సీ గురుకుల పాఠశాల, కళాశాల ఆవరణల్లో మొక్కలు నాటే కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఆహ్లాదకరమైన వాతావరణాన్ని విద్యార్థులకు అందించాలనే ఉద్దేశంతో మొక్కలు నాటుతున్నట్లు తెలిపారు. పిచ్చి మొక్కలను తొలగించి, విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి మొక్కలను నాటారు.

మురుగునీటి ఆవాసాలుగా ఖాళీస్థలాలు

- విషసర్పాలు, దోమలతో ప్రజలు అవస్థలు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు

తెనాలిఅర్బన్: తెనాలి పట్టణంలోని ఖాళీ స్థలాలు ప్రమాదభరితంగా మారాయి. వాటిలో పిచ్చి మొక్కలు మొలచి విషసర్పాలకు, దోమలకు నిలయాలుగా మారాయి. దీంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. తెనాలి పట్టణం రోజు రోజుకు విస్తరిస్తుండటం గుంటూరు, విజయవాడకు అతి దగ్గరగా ఉండటం, జిల్లాలో గుంటూరు తర్వాత అతి పెద్ద పట్టణంగా తెనాలి రూపుదిద్దుకోవటంతో ఇక్కడ నివసించేందుకు ప్రజలు ఎక్కువ ఆసక్తిని కనబరుస్తున్నారు. అంతే కాకుండా తెనాలి పట్టణంలో తాగునీటి కొరత కూడా ఉండదు. దీంతో పల్లెలలో నివసించే వారు, ఉద్యోగ రీత్యా ఇక్కడికి వచ్చిన వారు తెనాలిలో స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకుంటూ ఉంటారు. ప్రస్తుతం తెనాలి పట్టణంలో సుమారు రెండు లక్షలకు పైగా జనాభా ఉన్నారంటే తెనాలి ఏ స్థాయిలో అభివృద్ధి చెందుతుందో మనకు అర్థమవుతుంది. పెరుగుతున్న జనాభాతోపాటు స్థిర నివాసాలు పెరుగుతున్నాయి.

నాలుగు వందలకు పైగా ఖాళీ స్థలాలు..

తెనాలి పట్టణంలో ఇళ్ల మధ్య సుమారు 400కు పైగా ఖాళీ స్థలాలు ఉన్నాయనేది అధికారుల అంచనా. వీటిలో పిచ్చి మొక్కలు పెరిగి విషసర్పాలకు, పురుగులకు, పందులకు నిలయంగా మారుతున్నాయి. అంతేకాకుండా స్థలాలు పల్లంలో ఉండటం వల్ల సమీపంలోని మురుగు నీరు, వర్షపు నీరు దానిలో చేరి దుర్గంధ భరితంగా మారుతోంది. దీంతో ప్రజలు తరచూ వాటిని బాగు చేయించాలని అధికారులకు, కౌన్సిలర్‌లకు ఫిర్యాదులు చేస్తుంటారు. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ నేతృత్వంలో తెనాలి పట్టణంలో జరిగే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో కూడ ఎక్కువగా దీనిపైనే ప్రజలు ఫిర్యాదులు చేస్తుంటారు. దీనిని బట్టి చూస్తే పట్టణంలో ఈ సమస్య ఎంత తీవ్రంగా ఉందనేది మనకు అర్థమవుతుంది.



ఖాళీ స్థలాల్లో పెరిగిన పిచ్చి మొక్కలు



ఖాళీ స్థలాల్లో మున్సిపల్ బోర్డులను ఏర్పాటు చేస్తున్న సిబ్బంది (ఫైల్)

గతంలో వేకెంట్ ల్యాండ్ యాప్‌తో చర్యలు..

తెనాలి మున్సిపల్ అధికారులు ఖాళీ స్థలాలను బాగు చేయించేందుకు వేకెంట్ ల్యాండ్ అనే ప్రత్యేక యాప్‌ను సుమారు ఐదు సంవత్సరాల క్రితం రూపొందించారు. దానిలో ఖాళీ స్థలాలను నమోదు చేసి, వాటి యజమానులకు నోటీసులు ఇచ్చి వాటిని బాగు చేయించేవారు. యజమానుల ఆచూకీలేని స్థలాలను మున్సిపల్ సిబ్బందితో బాగు చేయించి దానికి అయిన ఖర్చును దానిలో నమోదు చేసేవారు. ఎప్పుడైనా యజమానులు భవన నిర్మాణ ప్లాన్‌కు వచ్చినప్పుడు వారి నుంచి స్థలం బాగు చేయించినందుకు అయిన ఖర్చును వసూలు చేసి తర్వాత నో అబ్జెక్షన్ సర్టిఫికెట్‌ను ఇచ్చి ప్లాన్ ఇచ్చే వారు. ఇలా మూడు సంవత్సరాలు జరిగిన తర్వాత దాని ఊసే అధికారులు మరిచారు. ఇదిలా ఉంటే గతంలో అధికారులు నోటీసులు ఇచ్చినా స్పందించని యజమానులకు బుద్ధి చెప్పేందుకు వారి స్థలాలలో ఇది మున్సిపల్ స్థలం అని తెలియజేసే బోర్డులు ఏర్పాటు చేశారు.

ఖాళీ స్థల యజమానులకు నోటీసులు



తెనాలి పట్టణంలో ఉన్న ఖాళీ స్థల యజమానులకు వాటిని బాగు చేయించాలని కొందరికి ఇప్పటికే నోటీసులు జారీ చేయడం జరిగింది. మిగిలిన వారిని కూడా గుర్తించి వారికి నోటీసులు అందజేస్తాం. అప్పటికీ స్పందించకపోతే మున్సిపాలిటీ బోర్డులు కూడా ఏర్పాటు చేస్తాం. ఖాళీ స్థలాల యజమానులు వెంటనే స్పందించి మీ స్థలాలను బాగు చేయించాలి.

– ఎం.జశ్వంతరావు, కమిషనర్, తెనాలి పురపాలక సంఘం

ఐకమత్యంతోనే సమస్యలకు పరిష్కారం

గుంటూరు ఎడ్యుకేషన్: కళాత్మక నైపుణ్యంతో కూడిన చేనేత సంఘీయులుగా పేరు గడించిన తొగట వీర క్షత్రియులు మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యను ఆయుధంగా చేసుకుని, ఐకమత్యంతో సమస్యల పరిష్కారం కోసం పోరాడాలని శ్రీ చౌడేశ్వరి తోగట వీర క్షత్రియ సేవా సంఘ రాష్ట్ర అధ్యక్షుడు మోడెం వీరాంజనేయప్రసాద్ పేర్కొన్నారు. శ్రీ చౌడేశ్వరి తోట వీర క్షత్రియ సేవా సంఘం 2023–25 సంవత్సరాలకు సంబంధించి నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని బ్రాడీపేటలోని పెన్షనర్స్ సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా నూతన అధ్యక్షుడు అనంత మల్లిఖార్జున మాట్లాడుతూ తొగట వీర క్షత్రియుల సామాజిక ఆర్థిక విద్యాపరమైన అభివృద్ధి కోసం జిల్లా నాయకత్వం పనిచేస్తోందని చెప్పారు. పేద విద్యార్థులకు కావలసిన విద్యాభివృద్ధికి అన్ని రకాల సహాయ, సహకారాలు అందజేస్తామని తెలియజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు, నగదు పారితోషకాలు అందజేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొమ్మిశెట్టి కృష్ణమూర్తి, నూతన గౌరవాధ్యక్షుడు డాక్టర్ కుందా వెంకటేశ్వర్లు, వెనిగళ్ల కోటేశ్వరరావు, ఉపాధ్యక్షులు నీలం చలమయ్య, పోస చౌడేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి వీర్నాల వెంకటేశ్వర్లు, కోశాధికారి కాల శ్రీనివాసరావు, ఉద్యోగ విభాగం గండిగ అంతోని, మహిళా నాయకులు ఎం.ఉషారాణి, పసల దివ్య పాల్గొన్నారు.



ప్రమాణ స్వీకారం చేస్తున్న కార్యవర్గ సభ్యులు

చిన్నారులకు వ్యాక్సిన్ తప్పనిసరి

ఫిరంగిపురం: మండలంలోని అన్ని గ్రామాల్లో మిషన్ ఇంద్రధనస్సులో భాగంగా గర్భిణులు, 0–5ఏళ్ల చిన్నారులకు వ్యాక్సిన్ వేసే కార్యక్రమం సోమవారం ప్రారంభించినట్లు నుదురుపాడు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి ఫరీనాబేగం అన్నారు. ఆమె మాట్లాడుతూ ఆయా గ్రామాల్లో ఇంటింటికి తిరిగి ఆరోగ్య సిబ్బంది వ్యాక్సిన్ వేయించుకోని వారి జాబితా తయారు చేసి వారికి ఇప్పటి నుంచి శనివారం వరకు వ్యాక్సిన్ వేస్తారని చెప్పారు. గర్భిణులకు టీడీ వ్యాక్సిన్, ఆరు, పది, పద్నాలుగు వారాల చిన్నారులకు రోటా, పెంటావాలెట్, ఐపీవీ, ఓపీవీ, పీసీవీ వ్యాక్సిన్ వేస్తారని తెలిపారు. పదినెలల చిన్నారులకు ఎంఆర్, పీసీవీ బూస్టర్, ఐపీవీ బూస్టర్, విటమిన్ ఏ సెల్యూషన్ వేయనున్నట్లు చెప్పారు. ఫిరంగిపురం 1, 2 సచివాలయ పరిధిలో, మేరికపూడి, మునగపాడు గ్రామాల్లో ప్రస్తుతం వ్యాక్సిన్ వేస్తున్నారని మిగిలిన గ్రామాలకు విడతల వారీగా వ్యాక్సిన్ వేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వోలు వెంకటలక్ష్మి, వెంకటరమణ, పీహెచ్‌ఎన్ గాయత్రీదేవి, హెచ్‌వీలు ఖాజాబీ, అన్నమేరి, ఎంఎల్ హెచ్‌పీ అమృత, మాబు, లావణ్య, పాపులమ్మ, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.



ఫిరంగిపురంలో వ్యాక్సిన్ వేస్తున్న ఆరోగ్య సిబ్బంది

చిరుధాన్యాల్లో పోషక విలువలు

ప్రత్తిపాడు: చిరుధాన్యాల్లో అత్యధిక పోషక విలువలు ఉంటాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వి.అరుణ అన్నారు. పోషణ మాసోత్సవాలలో భాగంగా సోమవారం గొట్టిపాడు సెక్టార్ పరిధిలోని పాతమల్లాయపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు, బాలింతలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అమలవుతున్న ప్రీ–ప్రైమరీ విద్యపై అవగాహన కల్పించారు. పీపీ–1, పీపీ–2 పుస్తకాల గురించి చిన్నారుల తల్లులకు తెలియజేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు బి.స్వాతి, వై.యమున పాల్గొన్నారు.

చదువుతోపాటు సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలి

తాడికొండ: విద్యార్థులు చదువుతోపాటు సేవా దృక్పథాన్ని పెంపొందించుకోవడం ద్వారా సమాజంలో ఉన్నత భావాలు కలిగిన వ్యక్తులుగా తీర్చిదిద్దబడతారని మోతడక చలపతి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె కిరణ్‌కుమార్ అన్నారు. కళాశాల ఈసీఈ విభాగం స్టూడెంట్స్ వింగ్ ఆధ్వర్యంలో సోమవారం గుంటూరు రవీంద్రనగర్‌లోని అనురాగ్ ఓల్డ్‌ఏజ్ అండ్ కేర్ సెంటర్‌ను సందర్శించి వృద్ధులకు అవసరమైన నిత్యావసరాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ జీవితంలో ఉన్నతంగా ఎదిగేందుకు సేవాగుణం ఎంతగానో ఉపయోగపడుతుందని, విద్యార్థి దశలో ఇలాంటి కార్యక్రమాలు భావి జీవితానికి ఉన్నత బాటలు వేస్తాయన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కె నాగశ్రీనివాసరావు, ఆర్ అండ్ డీ డీన్ డాక్టర్ పి బాలమురళీకృష్ణ, ఈసీఈ విభాగాధిపతి డి నాగ రవికిరణ్ పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న చలపతి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు

మహిళా సాధికారతకు కుట్టు శిక్షణ కేంద్రాలు

తాడేపల్లిరూరల్: సమాజంలో మహిళా సాధికారతకు కుట్టు శిక్షణా కేంద్రాలు ఉపయోగపడతాయని విజ్ఞాన కేంద్రాల రాష్ట్ర కన్వీనర్ పిన్నమనేని మురళీకృష్ణ అన్నారు. సోమవారం తాడేపల్లి బోసుబొమ్మ సెంటర్‌లోని మహిళా నైపుణ్య శిక్షణా కేంద్రంలో ఈనెల 15వ తేదీ నుంచి ప్రారంభం కానున్న మహిళా కుట్టు శిక్షణ కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ సమాజంలో మహిళలు ఆర్థికంగా నిలబడేందుకు కుట్టు మిషన్ శిక్షణ ఉపయోగపడుతుందని అన్నారు. ప్రస్తుతం కుట్టు మిషన్ శిక్షణ 90 రోజుల పాటు ఇస్తామని అన్నారు. భవిష్యత్తులో మగ్గం, ఎంబ్రాయిడింగ్, బ్యూటీషియన్, కంప్యూటర్, స్పోకెన్ ఇంగ్లీష్, గణితంలో మెళకువలు తదితర అంశాలపై శిక్షణ ఇస్తామని అన్నారు. మంగళగిరి, తాడేపల్లి బాలోత్సవం కోశాధికారి గాదె సుబ్బారెడ్డి, మహిళా శిక్షణా నైపుణ్య కేంద్రం నిర్వాహకులు చింతా వెంకటరత్నం మాట్లాడుతూ ఈ నెల 15 నుంచి డిసెంబర్ 15 వరకు 90 రోజులపాటు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు శిక్షణ ఇస్తామని అన్నారు. ఆసక్తి గలవారు దరఖాస్తు తోపాటు ఆధార్ కార్డు జిరాక్స్, పాస్‌పోర్ట్ ఫొటో, వెయ్యి రూపాయలు చెల్లించాల్సి ఉంటుందని, మరిన్ని వివరాలకు 7993934411, 9866029486 నంబర్లలో సంప్రదించాలని అన్నారు. కార్యక్రమంలో బాలోత్సవం నిర్వాహకులు దుర్గి కోదండరామయ్య, బిట్రా రామారావు, అంజిరెడ్డి, గంజి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్ ఎంపికలు వాయిదా

ప్రత్తిపాడు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 11, 12 తేదీల్లో జరగాల్సిన మండల స్థాయి క్రీడా ఎంపికలు వర్షం కారణంగా వాయిదా పడినట్లు మండల స్పోర్ట్స్ కో–ఆర్డినేటర్ పి. డేవిడ్ రాజ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వర్షాలు తగ్గుముఖం పట్టి, మైదానం క్రీడలకు సిద్ధమైన తర్వాత ఎంపికలను తిరిగి నిర్వహిస్తామని పేర్కొన్నారు. మండలంలోని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పీఈటీలు, పీడీలు, క్రీడాకారులు విషయాన్ని గమనించాలని కోరారు. అదేవిధంగా 14, 15 తేదీల్లో జరగాల్సిన నియోజకవర్గ స్థాయి ఎంపికలు కూడా వాయిదా పడినట్లు పేర్కొన్నారు. మండల స్థాయి ఎంపికలు ముగిసిన వెంటనే నియోజకవర్గ స్థాయి ఎంపికలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. మరోసారి ఎంపికలు జరిగే తేదీలను ప్రకటిస్తామని డేవిడ్ రాజ్‌కుమార్ చెప్పారు.

ఎమ్మెల్యే సొంత నిధులతో సీసీ రోడ్డు నిర్మాణం

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండలం పెనుమూలిలో ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) తన సొంత నిధులతో సీసీ రోడ్డు నిర్మాణాన్ని చేపట్టి సోమవారం నాటికి పూర్తి చేశారు. పెనుమూలి గ్రామం ముస్లిం కాలనీలో 40 సంవత్సరాల కిందట వేసిన రోడ్డు కాలక్రమేణా పాడైపోయి లోతట్టు ప్రాంతంగా ఏర్పడి చిన్నపాటి వర్షం పడినా మోకాళ్లలోతు నీళ్లు నిలిచేవి. చిన్నారులు, మహిళలు, వృద్ధులు బయటకు రావాలంటే తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని కాలనీ వాసులు ఎమ్మెల్యే ఆర్కే దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే తన సొంత ఖర్చులతో సీసీ రోడ్డు నిర్మాణాన్ని చేయించారు. సీసీ రోడ్డు నిర్మాణంపై స్థానిక ముస్లింలు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు.

ప్రమాదకరంగా ముళ్లపొదలు



ఫిరంగిపురం: గుంటూరు –కర్నూలు రాష్ట్ర రహదారికి ఇరువైపులా ఏపుగా ముళ్లపొదలు పెరిగి ప్రమాదకరంగా మారాయి. ఫిరంగిపురం నుంచి పొనుగుపాడు అడ్డరోడ్డు వరకు ప్రధాన రహదారికి ఇరువైపులా ఐదు అడుగుల ఎత్తులో ముళ్లపొదలు పెరిగాయి. దీంతో తర చూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. పొ లాల నుండి గేదెలు ఒక్కసారిగా పొదల వద్ద నుంచి బయటకు వస్తుండటంతో వాహనచోదకులు ప్రమాదాలు జరిగి మృతిచెందినవారు కొందరైతే, మరికొందరు క్షతగాత్రులైన వారు ఉన్నారు. కొన్ని మూల ప్రాంతాల్లో వాహనచోదకులకు ముళ్లపొదల కారణంగా ఎదురుగా వచ్చే వాహనం కన్పించక ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖాధికారులు స్పందించి ముళ్ల పొదలు తొలగించాలని వాహనచోదకులు కోరుతున్నారు.

న్యాయస్థానంపై ప్రజలకు నమ్మకం పెరిగింది

వేమూరు: అవినీతికి పాల్పడిన మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబును అరెస్టు చేయడంతో సామాన్యునికి న్యాయ స్థానంపై నమ్మకం పెరిగిందని, ప్రముఖ న్యాయవాది చందోలు డేవిడ్ విజయ కుమార్ అన్నారు. జంపని గ్రామంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు చెప్పుకుంటున్నట్లుగా ఆయన నిప్పు అయితే.. కోర్టులో తన శీలత ఎందుకు నిరూపించుకోలేకపోయారన్నారు. ఆయన అరెస్టుతో రాష్ట్రంలో ఎటువంటి అలజడి జరగకుండా పోలీసు యంత్రాంగం చర్యలు తీసుకుందన్నారు. ఇప్పటికే పలు కేసుల్లో స్టేలు తెచ్చుకున్న చంద్రబాబు కోర్టులో తన నిజాయతీని నిరూపించుకునేందుకు ఎందుకు జంకుతున్నారని ప్రశ్నించారు. జయలలిత, కరుణానిధి, లాలు ప్రసాద్ యాదవ్, చిదంబరం, అమిత్‌షా వంటి వారు జైలుకు వెళ్లి తమ నిజాయతీని నిరూపించుకునే యత్నం చేశారని గుర్తుచేశారు. వారి కంటే చంద్రబాబు ఏమీ అతీతుడు కాదని, టీడీపీ నేతలు అనవసరంగా ప్రశాంతంగా ఉన్న రాష్ట్రంలో బందులు, రాస్తారోకోలు, ఉద్రిక్తలు సృష్టించాలనే యత్నాలు మానుకోవాలని హితవు పలికారు. ప్రజా ధనం దుర్వినియోగంపై చంద్రబాబును ప్రశ్నించాల్సిన పవన్ కల్యాణ్ అందుకు.. భిన్నంగా ప్రభుత్వాన్ని ప్రశ్నించడం దారుణంగా ఉందన్నారు.

తెనాలిలో బంద్ విఫలం



బందోబస్తును పర్యవేక్షిస్తున్న సీఐలు



బస్టాండ్ వద్ద బందోస్తులో పోలీసు అధికారులు

తెనాలిరూరల్: స్కిల్ స్కాం కేసులో చంద్రబాబునాయుడును ముద్దాయిగా తేలుస్తూ ఏసీబీ కోర్టు రిమాండ్ విధించిన నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ పిలుపునిచ్చిన బంద్ విఫలమైంది. ఉదయం నుంచే ఆర్టీసీ బస్సు సర్వీసులు యథావిధిగా నడిచాయి. రెండవ శనివారం, ఆదివారం సెలవులు రావడంతో రెండు రోజుల పాటు వ్యాపార సంస్థలను మూసివేసిన వారు వరుసగా మూడవ రోజు సోమవారం కూడా షాపులు మూసివేయడానికి అంతగా ఆసక్తి చూపలేదు. ఎక్కడికక్కడ వ్యాపారస్తులు షాపులను తెరుచుకుని తమ వ్యాపారాలు నిర్వహించుకున్నారు. ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుండటంతో ఇళ్లకే పరిమితమైన టీడీపీ శ్రేణులు వర్షం తగ్గాక ఆందోళనలు చేసేందుకు రోడ్లపైకి వచ్చారు. అయితే ఈ నెల 12వ తేదీ వరకూ తెనాలిలో 144 సెక్షన్ అమలు చేస్తూ తహసీల్దార్ కె.రవిబాబు ఆదేశాలివ్వడం, పోలీసులు సైతం ర్యాలీలు, నిరసనలకు అనుమతి లేదని ముందస్తుగానే తెలపడంతో బంద్ ప్రభావం అంతగా కనిపించలేదు. కొందరు టీడీపీ, జనసేన నాయకులు మాత్రం ద్విచక్ర వాహనాలపై తిరుగుతూ తెరిచి ఉన్న వ్యాపార సముదాయాలను మూసివేయించే ప్రయత్నం చేశారు. బంద్‌కు జనసేన మద్దతు తెలపడంతో ఆ పార్టీ నాయకులు కూడా ఆందోళనలో పాల్గొన్నారు. పలుచోట్ల తెరిచి ఉన్న షాపులను, స్కూల్స్‌ను, బ్యాంకులను బలవంతంగా మూసి వేయించే ప్రయత్నం చేయడంతో పోలీసులు అడ్డుకున్నారు. వారిని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్లకు తరలించారు. బంద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా వన్ టౌన్, టూ టౌన్, త్రీ టౌన్, రూరల్ సీఐలు కె.చంద్రశేఖర్, ఎస్.వెంకట్రావు, ఎస్.రమేష్‌బాబు, కె.శ్రీనివాసరెడ్డి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసి పర్యవేక్షించారు.

ఆరోగ్యరంగంలో ఫార్మసీ విభాగం కీలకం

ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్‌కు ఇటీవల జరిగిన ఎన్నికల్లో విజయం సాధించిన నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారోత్సవం ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. స్థానిక బోసురోడ్డులోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానం ప్రాంగణంలోని కళ్యాణమండపంలో ఏర్పాటైన ప్రత్యేక సభకు ముఖ్యఅతిథిగా స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ హాజరయ్యారు. అసోసియేషన్ అధ్యక్షుడు జవ్వాజి వెంకట కృష్ణారావు, గౌరవ అధ్యక్షుడు బింగుమళ్ల సుబ్రహ్మణ్యం, వర్కింగ్ ప్రెసిడెంట్ తల్లం చంద్రశేఖరరావు, కార్యదర్శి ఏవీ నరసింహారావు, కోశాధికారి యజ్ఞ ప్రసాద్‌తోపాటు నూతన కార్యవర్గంలోని ఇతర సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. ఎమ్మెల్యే శివకుమార్ నూతన కార్యవర్గానికి అభినందనలు తెలియజేశారు. ఆరోగ్యరంగంలో ఫార్మసీ విభాగం కీలకమైనదిగా గుర్తుచేశారు. రోగులకు నాణ్యమైన మందులను విక్రయిస్తూ, వారి మన్ననలు పొందాలని సూచించారు. తెనాలి చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు దేసు శ్రీనివాసరావు, కార్యదర్శి గుండా రామకోటేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ ప్రధాన కార్యదర్శి సాధు ప్రతాప్, కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.చంద్రశేఖరరావు, కోశాధికారి టీవీ సుబ్రహ్మణ్యం పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు.



నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం

బాలుడిని తీసుకెళ్లిన మతిస్థిమితంలేని మహిళ

గంట వ్యవధిలోనే గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించిన పోలీసులు

తెనాలిరూరల్: మతిస్థిమితం లేని మహిళ తన బంధువుల ఇంటికి వెళ్లి నాలుగేళ్ల బాలుడిని తనతో తీసుకెళ్లిపోయింది. బాలుడు కనబడడంలేదని గుర్తించిన కుటుంబసభ్యులు ఆచూకీ కోసం ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో పోలీసులను ఆశ్రయించగా కేవలం గంట వ్యవధిలోనే పోలీసులు సదరు మహిళ, బాలుడి ఆచూకీ గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. వివరాలిలా ఉన్నాయి. తెనాలి మారిస్‌పేట సీఎం కాలనీ 6వ లైనుకు చెందిన గిరిజకు మతిస్థిమితం సరిగా ఉండదు. సోమవారం సాయంత్రం ఆమె తన ఇంటి సమీపంలో నివసించే బంధువుల ఇంటికి వెళ్లింది. అక్కడ కొద్దిసేపు గడిపిన ఆమె ఆ ఇంట్లోని నాలుగేళ్ల సిరిగిరి గౌతమ్‌విఘ్నేష్‌ను తన వెంట తీసుకుని వెళ్లింది. కొద్దిసేపటికి బాలుడు కనబడడంలేదని గుర్తించిన తల్లి, కుటుంబసభ్యులు వెతకడం ప్రారంభించారు. గిరిజ కనబడకుండా పోయిందని తెలుసుకుని త్రీ టౌన్ పోలీసులను ఆశ్రయించారు. సీఐ ఎస్.రమేష్ బాబు వెంటనే ఏఎస్‌ఐ హైదర్ అలీ, సిబ్బందిని అప్రమత్తం చేశారు. రంగంలోకి దిగిన సిబ్బంది బాలుడి ఇంటికి వెళ్లి ఆ ప్రాంతంలో జల్లెడ పట్టారు. వెంటనే బాలుడు అదృశ్యమయ్యాడని మైక్ కాన్వాస్ ఏర్పాటు చేయించారు. అందుబాటులో ఉన్న సీసీ కెమెరాల పుటేజీలను పరిశీలించారు. యడ్ల లింగయ్య పెట్రోల్ బంక్ వద్ద సీసీ పుటేజ్‌లో బాలుడు, గిరిజ వెళ్లినట్టు గుర్తించారు. ఆటో డ్రైవర్లు, అటుగా వెళుతున్న వారిని విచారించి గంట వ్యవధిలోనే గౌతమ్‌విఘ్నేష్‌తో పాటు గిరిజనూ తెనాలి ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో గుర్తించారు. వారిరువురిని స్టేషన్‌కు తీసుకువచ్చి కుటుంబసభ్యులకు అప్పగించారు. కేసు నమోదు చేయడం పూర్తి కాకుండానే నిమిషాల వ్యవధిలో బాలుడి ఆచూకీ గుర్తించిన సిబ్బందిని సీఐ రమేష్‌బాబు అభినందించారు.



బాలుడిని కుటుంబసభ్యులకు అప్పగిస్తున్న సీఐ రమేష్‌బాబు

రోడ్డు ప్రమాదంలో ఫొటోగ్రాఫర్ మృతి

- మరో ముగ్గురికి గాయాలు
- హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డుపై ఘటన

తెనాలిరూరల్: తెనాలిలో మల్లి వీడియోస్‌గా ప్రాచుర్యం పొందిన ఫొటో కం వీడియోగ్రాఫర్ పుట్టగుంట మల్లికార్జునరావు అలియాస్ మల్లి(54) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. బంధువులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నందులపేటకు చెందిన మల్లి తెనాలి నుండి తన కుమారుడు దీపక్ సాయితో పాటు మరో ఇద్దరు ఫొటో వీడియోగ్రాఫర్లతో కలిసి ఓ శుభకార్యం నిమిత్తం హైదరాబాద్‌కు తమ సొంత కారులో వెళ్లారు. ఆదివారం సాయంత్రం ఫంక్షన్ ముగించుకుని తిరిగి తెనాలి వస్తుండగా హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డుపై సోమవారం తెల్లవారుజామున ప్రమాదానికి గురయ్యారు. వీరి కారును డీసీఎం లారీ ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది. ప్రమాదంలో కారు ముందు భాగం పూర్తిగా ధ్వంసం కాగా స్థానికులు వారిని హుటాహుటిన ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో వీడియో గ్రాఫర్ మల్లి మృతి చెందారు. వీరితో పాటు ఉన్న ఆయన కుమారుడు దీపక్ సాయి, నరసరావుపేటకు చెందిన అబ్దుల్లా కొద్దిపాటి గాయాలతో ప్రాణాపాయం నుండి బయటపడ్డారు. తెనాలి మండలం బుర్రిపాలెం గ్రామానికి చెందిన మల్లెల వెంకట్‌కు తీవ్ర గాయాలు కాగా అతడికి ఐసీయూలో చికిత్స అందిస్తున్నారు. కాగా వెంకట్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. మృతుడు మల్లికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. గత 35 ఏళ్లుగా ఆయన ఫొటోగ్రఫీ రంగంలో ఉన్నారు. వీడియోగ్రాఫర్స్ అండ్ ఫొటోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ పూర్వ అధ్యక్షుడైన మల్లి మృతి చెందడం పట్ల పలువురు ఫొటో, వీడియో గ్రాఫర్లు విచారం వ్యక్తం చేశారు.



పుట్టుగుంట మల్లికార్జునరావు(ఫైల్)



చికిత్స పొందుతున్న వెంకట్